ప్రజాశక్తి
గురువారం 25 జనవరి, 2024
5
శ్రీకాకుళం



నేడు వైసిపి జిల్లాస్థాయి సమావేశం

జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్

శ్రీకాకుళం అర్బన్ : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఈ నెల 27న విశాఖ నగరంలోని భీమిలి నుంచి ఎన్నికల ప్రచారానికి రానున్న నేపథ్యంలో గురువారం జిల్లా స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సూర్యమహల్ సమీపాన గల జిల్లా పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సమావేశానికి పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వై.,వి.సుబ్బారెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు, ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు.

నదుల అనుసంధానం

పూర్తయ్యేదెప్పుడు?

- ఇప్పటివరకు 80 శాతం పనులు పూర్తి
- భూసేకరణకు చెల్లింపుల్లో జాప్యమే ప్రధాన కారణం
- డిసెంబరు 31తో ముగిసిన ఒప్పంద గడువు
- జూన్ వరకు మరోసారి పొడిగింపు

వంశధార-నాగావళి నదుల అనుసంధానాన్ని ప్రభుత్వ ప్రాధాన్యతా ప్రాజెక్టుగా గుర్తించినా సకాలంలో పూర్తి చేయడంలో విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒప్పందం ప్రకారం డిసెంబరు 31వ తేదీ నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. 2017లో మొదలైన పనులు ఒప్పందం ప్రకారం 2020 నాటికల్లా పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటివరకు 80 శాతమే పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ నాటికి పూర్తవుతుందని వంశధార ఇంజినీరింగ్ అధికారులు భావించినా జరగలేదు. దీంతో జూన్ వరకు మరోసారి గడువు పొడిగించారు. కాలువ తవ్వకాలకు సేకరించిన భూములకు చెల్లింపులు చేయకపోవడమే జాప్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. కాలువ తవ్వకాలకు కొన్నిచోట్ల కోర్టు కేసులూ ఉండడం మరో కారణంగా ఉంది. దీంతో ప్రస్తుతం పనులు మందకొడిగా సాగుతున్నాయి.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార, నాగావళి నదుల అనుసంధానంలో భాగంగా హిరమండలం రిజర్వాయర్ గట్టుకు రెండు తూములు ఏర్పాటు చేసి అక్కడ్నుంచి 33.58 కిలోమీటర్ల మేర నారాయణపురం వరకు కాలువ తవ్వాల్సి ఉంది. హిరమండలం వద్ద నీటిని సరఫరా చేసే చోట 43.7 మీటర్ల స్థాయిలో, నారాయణపురం ఆనకట్ట వద్ద కాలువ కలిసే చోట 29.09 మీటర్లు నిర్మించేలా డిజైన్ చేశారు. తద్వారా ఏటవాలుగా నీరు ప్రవహించి ఆనకట్టకు చేరుతుంది. నదుల అనుసంధానం పూర్తి చేస్తే ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో ఉన్న ఐదు వేల ఎకరాలకు సాగునీరందుతుంది. దీంతోపాటు నారాయణపురం ఆనకట్ట ప్రధాన కాలువల కింద ఉన్న 37,053 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది.

పెరిగిన ప్రాజెక్టు వ్యయం

వంశధార, నాగావళి నదుల పనులను రూ.84.90 కోట్ల వ్యయంతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 27, 2017లో పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ప్రాజెక్టు పనులను నెల్లూరుకు చెందిన పి.వి రమణయ్య అండ్ కంపెనీకు రూ.57.99 కోట్లకు పనులను అప్పగించింది. అనుసంధాన పనులు 2020 నాటికే పూర్తి కావాల్సి ఉంది. పలుమార్లు ఒప్పంద కాలపరిమితిని పొడిగించినా పనులు పూర్తి కాలేదు. అంచనా వ్యయాన్ని సవరించి రూ.145.34 కోట్లకు పెంచింది. ఇప్పటివరకు రూ.85.71 కోట్లను వెచ్చించారు.

భూసేకరణ చెల్లింపుల్లో జాప్యం

హైలెవల్ కెనాల్ పనులకు సంబంధించి భూసేకరణ పూర్తయినా ప్రభుత్వం నేటికీ రైతులకు డబ్బులు చెల్లించలేదని తెలుస్తోంది. కాలువ తవ్వకాలకు మరో 49.23 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించినా ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదు. ఇందుకోసం రూ.8.26 కోట్లు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదని తెలుస్తోంది.



బూర్జ మండలం కొల్లివలస, సింగన్నపాలెం మధ్య అసంపూర్తిగా హైలెవల్ కెనాల్ పనులు

కాలువ పనులకు అడ్డంకిగా కోర్టు కేసులు

బూర్జ మండలం చినలంకాంలో కాలువ నిర్మాణం కోసం దేవాదాయ, ధర్మాదాయశాఖకు చెందిన సుమారు 7.5 ఎకరాలు అవసరమైంది. వంశధార అధికారులు పరిహారం కింద దేవాదాయ, ధర్మాదాయశాఖకు రూ.1.50 కోట్లు చెల్లించేశారు. భూముల్లో 13 మంది రైతులు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నారు. చట్టం ప్రకారం పరిహారంలో 60 శాతం దేవాదాయ, ధర్మాదాయశాఖకు, 40 శాతం కౌలు రైతులకు ఇవ్వాల్సి ఉంది. కౌలు రైతులకు పరిహారం చెల్లింపునకు సిద్ధమవుతున్న తరుణంలో ఆ భూములకు ఆలయానికి ఇచ్చిన ధర్మదాత పరిహారం ఇవ్వాల్సి వస్తే తనకు ఇవ్వాలని, లేకుంటే దేవాదాయశాఖకు చెందాలంటూ కోర్టును ఆశ్రయించాడు. దీంతో బూర్జ మండలం చినలంకాం పరిధిలో 700 మీటర్ల మేర కాలువ తవ్వకాలకు బ్రేక్ పడింది. నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గంలో కాలువ నిర్మిస్తామని అధికారులు చెప్తున్నారు.



శ్రీకాకుళం అర్బన్ : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

సమిష్టి పోరాటం వల్లే విజయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా 42 రోజులపాటు ఎన్నోవ్యయ ప్రయాసలకోర్చి ఎన్నో నిర్బంధాలను సైతం లెక్క చేయకుండా సమిష్టిగా పోరాడడం వల్లే విజయం సాధ్యమైందని, అంగన్వాడీ సమ్మె విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కరణం కళ్యాణి అన్నారు. నగరంలోని గుజరాతీపేటలో ఉన్న అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీల విజయోత్సవ సభ బుధవారం నిర్వహించారు. ఈ సభలో వారు హాజరై మాట్లాడుతూ ప్రభుత్వంతో చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమించినట్టు తెలిపారు. సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ లభించిందన్నారు. సమ్మెను విరమించి యథావిధిగా విధుల్లోకి అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు చేరారన్నారు. సమ్మెలో పాల్గొని మద్దతు తెలియజేసిన లబ్ధిదారులకు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, సామాజిక సంఘాలు వివిధ రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు గుజరాతీపేట పుర వీధుల్లో విజయోత్సవన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డి.జ్యోతి, ముత్యాలమ్మ, కె.పార్వతి, లక్ష్మి, సూర్యకుమారి, లీలాకుమారి, అంజలిభాయ్, మల్లేశ్వరి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: తమ హక్కులు డిమాండ్ల సాధన కొరకు పోరాడినప్పుడే సాధ్యమవుతాయని సిఐటియు నాయుకులు హనుమంతు ఈశ్వర రావు, దుంపల సుదర్శన, సామ సంజీవరావు, జి.వి.రమణలు అన్నారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో అంగన్వాడీలు సంబరాలు చేసుకున్నారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : సంబరాలు చేసుకుంటున్న అంగన్వాడీలు

రాష్ట్రంలో విధ్వంసకర పాలన

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- నౌపడ

వైసిపి ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచే రాష్ట్రంలో విధ్వంసకర పాలన ప్రారంభమైందని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కిలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. సంతబొమ్మాళి మండలం కాకరపల్లి నుంచి ఆయన ఎన్నికల శంఖారావాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై, పనితీరుపై నిప్పులు చెరిగారు. 2019లో ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంపైన కక్షకట్టారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పులమయంగా చేసిందని విమర్శించారు. ఈ ఐదేళ్లలో రూ.పది లక్షల కోట్ల అప్పులు చేసి రూ.రెండున్నర లక్షల కోట్లు పంచి పెట్టారని, మిగతా సొమ్ము ఎవరి ఇంటికి చేరిందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలపై రూ.నాలుగు లక్షల కోట్ల పన్నుల భారం మోపారని విమర్శించారు. ప్రతి మంగళవారం అప్పుల వారంగా మార్చారని దుయ్యబట్టారు.



మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

సిఎం జగన్ సొంత తల్లిని, చెల్లిని మోసం చేశారని విమర్శించారు. తను చేసిన మోసానికి ఆమె చెల్లెలు మరో పార్టీలో పనిచేసే పరిస్థితికి వెళ్లిందన్నారు. కాకరాపల్లిలో ప్రతివీధిలోనూ రోడ్లు, ఇంటింటికీ తాగునీరు అందించామని చెప్పారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి టిడిపి మండల అధ్యక్షుడు జీరు భీమారావు, సీనియర్ నాయకులు రెడ్డి అప్పన్న, విష్ణుమూర్తి, పల్లి జోగారావు పాల్గొన్నారు.

అసమ్మతి నేతపై పార్టీ ఉపేక్ష ఎందుకో?

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అసమ్మతి నేత సువ్వారి గాంధీపై అధిష్టానం ఎందుకు ఉపేక్షిస్తున్నదో అర్థం కావడం లేదని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ యార్డులో నియోజకవర్గంలోని నాలుగు మండలా లు, మున్సిపాలిటీ పరిధిలోని వైసిపి నాయకులతో, కార్యకర్తతో ఈ నెల 27న సిఎం జగన్ భీమిలి సభ విజయవంతానికి బుధవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పాటికే అసమ్మతి నేతలపై చర్యలు తీసుకోవాల్సిందేని అన్నారు. పార్టీ నిర్ణయం కోసం వేచి చూస్తున్నానని అన్నారు. మండలానికి పది బస్సులు చొప్పున నాలుగు మండలాలు, మున్సిపాలి టీకి కలిపి 50 బస్సులను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. గ్రామాల్లోని వైసిపి నాయకులు అధిక సంఖ్యలో ప్రజలు బయలుదేరాలా కృషి చేయాలన్నారు. అనంతరం ఎన్నికలకు సిద్ధం అన్న బ్రోచర్‌ను ఆవిష్కరించి సిద్ధమా అని నాయ కులను, కార్యకర్తలను ప్రశ్నించారు. సిద్ధమేనని నాయకులు బదులిచ్చారు. ఈ సమావేశానికి వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు పాల్గొనకపోవడంపై పలువురు చర్చించుకున్నారు. కార్యక్రమంలో వైసిపి పరిశీలకులు ఇందుకూరు రఘురామరాజు, తమ్మినేని చిరంజీవి నాగ్, గురుగుబెల్లి శ్రీనివాస రావు, బొడ్డేపల్లి నారాయణరావు, నిరంజన్, బెవర మల్లేశ్వరరావు, కె.వి.జి.సత్యనారాయణ, సురవరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వచ్చే సాధారణ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలుగా వినియోగించే భవనాలకు చెందిన శాఖల అధికారులు, ఇఆర్ఒ, ఏఇఆర్ఒలతో కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి బుధవారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఫర్నిచర్, పోలింగ్ గదిలోనూ, ఓటర్లు వరుసలో నిలబడే ఆ ప్రాంగణంలోనూ తగిన విధంగా విద్యుత్ సౌకర్యం, లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, వికలాంగుల కోసం ర్యాంప్ సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పెండింగ్ పనులను 29లోగా యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, వ్యవసాయ, జిల్లా పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, పంచాయతీరాజ్, వివిధ సంక్షేమశాఖలకు చెందిన భవనాలు ఉన్నందున ఎన్నికల సెక్టార్ ఆఫీసర్లతో పాటు సంబంధిత శాఖల అధికారులు ఆ భవనాలను తనిఖీ చేసి పనులు పూర్తయినట్లు నివేదికను అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఉప కలెక్టర్లు జయదేవి, పద్మావతి, వివిధ శాఖల అధికారులు అర్.జయప్రకాష్, బి.శాంతిశ్రీ, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ధర్మాన రాజకీయ వైరాగ్యం

జగన్ బలవంతంపైనే పోటీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు నోటి వెంట మళ్లీ రాజకీయ వైరాగ్యం పలుకుతున్నారు. సభలు, సమావేశాల్లో పాల్గొన్న సమయంలో ప్రజలతో తన మనసులో మాటగా చెపుతూ ఈసారి ఎన్నికల్లో పోటీ చేయడం తనకు ఎంత మాత్రం ఇష్టం లేదని, కానీ, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి తనకు ఈసారి తప్పక పోటీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని చెపుతున్నారు. మంగళవారం శ్రీకాకుళం రూరల్ మండలం ఇప్పిలిలో నిర్వహించిన ఆసరా కార్యక్రమంలో తన కుమార్ రాంమనోహరనాయుడితో పాటు ఆయన హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తనకు పోటీ చేసే ఆలోచన లేదని కార్యకర్తలకు స్పష్టం చేశారు. 25



ఏళ్లుగా ఎమ్మెల్యేగా పనిచేస్తున్నానని, ఇక విశ్రాంతి తీసుకుంటానని సిఎంకు చెప్పానని అన్నారు. రాజకీయాల్లో విసిగిపోయానని పార్టీ వ్యవహారాలు చూసుకుంటానని జగన్‌కు ఇప్పటికే స్పష్టం చేసినట్టు చెప్పుకొచ్చారు. తనకు పోటీ చేసే ఆలోచన లేకపోయినా జగన్ మాత్రం అంగీకరించడం లేదన్నారు. పార్టీ ప్రయోజనం కోసం ఈ ఒక్క సారి పోటీ చేయాలని ఒత్తిడి చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వల్లే తిరిగి పోటీ చేయాల్సి వస్తుందంటూ తన మనసులో మాటను బయటపెట్టారు.



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

30 శాతం ఐఆర్‌ను, పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర పిలుపు మేరకు పట్టణంలో యుటిఎఫ్ కార్యాలయం నుంచి డే అండ్ నైట్ కూడలి, అక్కడ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకూ బుధవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరెండర్ లీవ్‌లు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, మెడికల్ రీయంబర్స్‌మెంట్, డిఎలు, పిఆర్‌సి రూపంలో రూ.18 కోట్లు పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు కాలేదన్నారు. ప్రభుత్వం ప్రతి పోరాట సందర్భంగా కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఇబ్బంది పెడుతుందని అన్నారు. అప్రజాస్వామ్య వైఖరి విడనాడాలన్నారు. అలాగే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజాస్వామ్యతంగా పోరాటం చేస్తుంటే ఉపాధ్యాయులపై నిర్బంధాలు, అక్రమంగా కేసులు పెడుతూ భయాందోళనలకు గురి చేస్తున్నారని, ఇది సరికాదని హితవుపలికారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు, సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, కోశాధికారి బి.రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా కార్యదర్శి హనుమంతు అన్నాజీరావు, బి.శంకరరావు, పి.సూర్యప్రకాషరావు, జి.శ్రీరామచంద్రమూర్తి, పి.మురళీధర్‌రావు, జి.సురేష్, రాష్ట్ర కౌన్సిలర్లు పి.అప్పారావు, ఎస్.నారాయణరావు పాల్గొన్నారు.

ఎరక్కపోయి... ఇరుక్కుపోయి

ఆర్‌టిసి కిటికీలో ఇరుక్కున్న ప్రయాణికుడు

ఆర్‌టిసి బస్సు కిటికీలో ఓ ప్రయాణికుడు తల ఇరుక్కుపోయింది. ఉమ్ము ఊయడానికి ప్రయత్నించే క్రమంలో ముందుకు వెళ్లలేక, వెనక్కి రాలేక మధ్యస్తంగా నలిగిపోయాడు. స్థానికులు, తోటి ప్రయాణికులు చొరవ చూపి అతి కష్టంమీద 15 నిముషాల పాటు కష్టపడి ఇరుక్కుపోయిన తలను బయటకు తీశారు. ఆ సమయంలో ప్రయాణికులు టెన్షన్‌కు గురయ్యారు. ఈ ఘటన బుధవారం టెక్కలిలో చోటు చేసుకుంది.

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

నౌపడ నుంచి టెక్కలి వైపు వెళ్తున్న ఆర్‌టిసి పల్లె వెలుగు సంతబొమ్మాళి మండలం సుందరరావు ఆర్‌టిసి బస్సు ఎక్కాడు. టెక్కలి ఇందిరాగాంధీ విగ్రహం కూడలి వద్ద ఉమ్ము బయటకు ఊయడానికి సైడు డోర్ నుంచి తలను బయటకిపెట్టాడు. తిరిగి వెనక్కి వస్తున్న క్రమంలో ఆ మధ్యలో తల ఇరుక్కుపోయింది. సుందరరావు



కిటికి డోర్‌లో ఇరుక్కున ప్రయాణికుడి తల

ఎంత ప్రయత్నించినా తల బస్సులోపల వైపుకి రాకపోవడంతో షాక్ గురయ్యాడు. ఈ విషయాన్ని తోటి ప్రయాణికులు గమనించి కండక్టర్, డ్రైవర్‌కు సమాచారం అందజేశారు. అందరూ కలిసి అతడికి సహాయం చేసేందుకు 15 నిముషాలు చర్యలు చేపట్టారు. అయినా తల బయటకు రాలేదు. చివరకు కిటికీకి ఉన్న రేకును స్థానికులు వంచి తలను బయటకు వచ్చేలా చేశారు. దీంతో ఆ ప్రయాణికుడు ఊపిరిపీల్చుకున్నాడు. ఈ 15 నిముషాలు టెన్షన్‌కు గురయ్యాయని ప్రయాణికుడు సుందరరావు తెలిపారు. బస్సుల్లో ప్రయాణాలు చేసే ప్రయాణికులు సైడు డోర్ నుంచి తలను బయటకు పెట్టి కోరి కష్టాలు తెచ్చువద్దని చెప్పడానికి ఇదో హెచ్చరిక.

రథసప్తమి మౌలిక వసతులకు వేలం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈ ఏడాది ఫిబ్రవరి 16న జరగనున్న రథసప్తమి వేడుకల్లో తాత్కాలిక పద్ధతిలో మౌలిక వసతుల కల్పన పనులకు బుధవారం సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పరసరాల్లో సందర్శకుల క్యూ లైన్లు ఏర్పాటు, విద్యుత్ అలంకరణ, షామియానాలు, కార్పెట్లు, రంగులు వేయడానికి వేలం నిర్వహించారు. వేలంలో పాల్గొన్న కాంట్రక్టర్లలో తగ్గింపు పాటదారులు పిల్లా మౌళి రూ.2,10,000 క్యూలైన్ల ఏర్పాటుకు, ఉంగటి పాపారావు రూ.3,00,000 విద్యుత్ అలంకరన, కెగోవింద్ షామియానాలు కార్పెట్లు వేసేందుకు రూ.2,60,000, రంగులు వేయడానికి తగ్గింపు పాట దారుడు గోపి రూ.2,20,000లకు దక్కించుకున్నారు. వేలంలో ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి చైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు, ఆలయ పాలక మండలి సభ్యులు జలగడుగుల శ్రీనివాసరావు, శ్రీకూర్మం ఆలయ కార్యనిర్వహణాధికారి జి.గురునాథం పాల్గొన్నారు.


ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ఆర్థిక చేయూతనిచ్చేందుకే 'ఆసరా'

ప్రజాశక్తి- జి.సిగడాం

మండల కేంద్రంలో పాతపెట్రోల్ బంక్ ఎదురుగా వైఎస్ఆర్ ఆసరా 4వ విడత సంబరాల్లో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పాల్గొన్నారు. మండలానికి సంబంధించి 1078 స్వయం సహాయక సంఘాల్లో 12,262 మంది మహిళలకు రూ.8,93,22,681 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్క చెల్లెమ్మలకు ఆర్థికంగా చేయూతనిచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకే ఆసరా, సున్నా వడ్డీ, కాపు నేస్తం, అమ్మ ఒడి తదితర సంక్షేమ పథకాలను సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. మహిళా పక్షపాతిగా ఉన్న జగనన్నకు రానున్న ఎన్నికల్లో మహిళలందరూ అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మీసాల సత్యవతి, ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షులు బత్తుల సన్యాసిరావు, జెసిఎస్ ఇన్‌ఛార్జి దోల వెంకటరమణ పాల్గొన్నారు.

పోలాకి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని జిల్లాపార్టీ అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. మండలం మబగాం గ్రామంలో వైఎస్ఆర్ ఆసరా 4వ విడత సంబరాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళలను లక్షాధికారులను చేస్తామని ప్రజాసంకల్పయాత్రలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని అన్నారు. అన్ని సంక్షేమ పథకాలు మహిళల పేరిటే ఇస్తూ మహిళాలోకంపైనే సిఎం నమ్మకం పెట్టుకున్నారన్నారు. మండలంలో నాలుగో విడత ఆసరా కానుక రూ.10 కోట్లు లబ్ధిదారులకు విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆసరా చెక్కును లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, డిసిసిబి ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ దమయంతి, పార్టీ అధ్యక్షులు కణితి కృష్ణారావు, కణితి సత్తిబాబు, రెంటికోట శ్రీనాధరావు, వైస్ ఎంపిపి కోట అప్పారావు, నాయకులు, కార్యకర్తలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


ప్రభుత్వం అందజేసిన లబ్ధిని వివరిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - పొందూరు

స్థానిక ప్రజాసమస్యలను పరిష్కరించేందుకే సిఎం జగన్మోహన్‌రెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలం తాడివలస పంచాయతీ లచ్చయ్యపేట, గండ్రేడు గ్రామాల్లో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేసిన లబ్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొండాడ రమణమూర్తి, ఎంపిసి డైరెక్టర్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

ఆసరా కాదు... టోకరా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


మాట్లాడుతున్న రవికుమార్

డ్వాక్రా రుణమాఫీ, పసుపు కుంకుమ ద్వారా చంద్రబాబు పాలనలో కోటి మంది మహిళలకు రూ.20 వేలు వంతున లబ్ధిపొందారని, కానీ, జగన్ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో 79 లక్షల మందికి రూ.15 వేలు వంతున మాత్రమే ప్రయోజనం కల్పించారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మిగిలిన వారంతా మహిళలు కారా? అని ప్రభుత్వానికి ప్రశ్నించారు. మరోవైపు చౌక బారు మద్యం అమ్మి కుటుంబాలను అనారోగ్యం బారిన పడేశారని, ఇచ్చిన మొత్తాలను నాలుగింతలు తిరిగి గుంజుకున్నారని ధ్వజమెత్తారు. ధరల పెంపుతో ప్రజాపై మోయలేనంత భారాన్ని మోపారన్నారు. సొంత చిన్నాన్నను చంపిన నరహంతకులను రక్షిస్తున్న సిఎం చిన్నమ్మకు ఏమని సమాధానం చెపుతారని ప్రశ్నించారు. అలాగే చెల్లెలి ఆస్తిలో భాగం ఇవ్వకుండా ఇంటి నుంచి ప్రాణ భయంతో వెళ్లి పోయేందుకు కారకుడయ్యారని ఆరోపించారు. సొంతింటి ఆడ వాళ్లను రక్షించలేని సిఎం రాష్ట్రంలోని మహిళలకు ఎలాంటి రక్షణ కల్పించగలరని ప్రశ్నించారు. ఉచితంగా ఇళ్లు ఇస్తానని నమ్మించి మాట తప్పి ఒటిఎస్ పేరుతో ఒక్కో మహిళ నుండి రూ.10 వేల నుంచి రూ.30 వేలు బలవంతంగా వసూలు చేశారన్నారు. సెంటు పట్టాలో ఇళ్ల నిర్మాణం పేరుతో మహిళలను అప్పులపాలు చేశారని, గతంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఇవ్వకుండా అన్యాయం చేశారని అన్నారు. 2022 లోనే మహిళలపై 25,503 నేరాలు జరిగాయి. 601 అత్యాచారాలు, 180 అత్యాచార యత్నం ఘటనలు వెలుగు చూశాయని, జాతీయ స్థాయిలో మహిళలపై నేరాల రేటు 66.4 శాతం కాగా, ఎపిలో మాత్రం 96.2 శాతం నమోదు కావడం మహిళా భద్రతలో డొల్లతనాన్ని తెలియజేస్తోందని వ్యాఖ్యానించారు. ఇటువంటి అరాచక ప్రభుత్వానికి చరమగీతం పాడాలన్నారు.

'జిల్లాలో బెంతు ఒరియాలు లేరు'

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో బెంతుఒరియాలు లేరని, నకిలీ బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చరాదని రాష్ట్ర ఆదివాసీ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులు, జిల్లా జెఎసి అధ్యక్షులు సవర రాంబాబులు డిమాండ్ చేశారు. బుధవారం కాశీబుగ్గ పెట్రోల్ బంక్ నుంచి మూడు రోడ్ల జంక్షన్ మీదుగా కాశీబుగ్గ బస్టాండ్ వరకు చేరుకొని మానవహారం చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ భరత్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర మంత్రి డా. సీదిరి అప్పలరాజు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషలు గిరిజన ర్యాలీకి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.52 ద్వారా బోయవాల్మీకి, ఇతర కులాలను ఎస్‌టిలో చేర్చేందుకు కేబినెట్ చేసిన తీర్మానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల సబ్‌ప్లాన్ నిధులు గిరిజనులకే వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి ప్రధాన కార్యదర్శి జి.అప్పన్న, పలాస గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పి.ఈశ్వరరావు, మండలాధ్యక్షులు ఎం.జగన్, గణేష్, ఎస్.లోకేశ్వరరావు, జె.రామారావు, సిద్ధు, వి.కృష్ణారావు, వాబ యోగి, లక్ష్మీనారాయణ, హేమలత, కె.పోలయ్య, ఎస్.దేవేంద్ర, ఎస్.పురుషోత్తమరావులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం


ఎచ్చెర్ల : మాట్లాడుతున్న రసమున్నియా బేగం


పొందూరు : మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు, ఉద్యోగినిలకు మరింత భద్రత అవసరమని, దానికి సంబంధించిన లైంగిక వేధింపుల నిరోధక (పోష్) చట్టం-2013 కచ్చితంగా ప్రతి సంస్థలోనూ అమలు కావాలని విశాఖపట్నం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్-1 సభ్యులు రసమున్నియా బేగం అభిప్రాయపడ్డారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బేగం 'పోష్' చట్టం అమలు, అనుసరించాల్సిన విధానాలు, చట్టం చెబుతున్న నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల హక్కులను పరిరక్షించడమే కాకుండా సురక్షితమైన పని వాతావరణాన్ని ఆయా సంస్థలు, కార్యాలయాలు కల్పించాలన్నారు. మానసిక, అభ్యంతరకర, పరోక్ష బెదిరింపులు, పనిలో హానికరమైన ప్రాధాన్యత వంటివన్ని మహిళలు పనిప్రదేశాల్లో ఎదుర్కొన్నట్లయితే కచ్చితంగా పోష్ చట్టం వర్తిస్తుందన్నారు. ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రయివేటు రంగానికీ ఈ చట్ట పరిధిలోకి వస్తాయన్నారు. ఆయా సంస్థలు పనిప్రదేశాల్లో మహిళల కోసం అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు వచ్చిన ఫిర్యాదులను త్వరతగతిన పరిష్కరించాలని సూచించారు. మహిళల కూడా స్వీయ విశ్లేషణ, జాగురత కలిగి ఉండాలన్నారు. బిఆర్ఎయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజని మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి, భద్రతకు వర్సిటీ ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. వారి నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చిన సానుకూల దృక్పదంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని మహాలక్ష్మి నగర్ కాలనీలోని చైతన్య హైస్కూల్ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడులు పాల్గొన్నారు. సమాజంలో అవకాశాలు బాల, బాలికలకు సమానంగా ఉన్నాయని తెలిపారు. గర్భస్థ లింగ నిర్ధారణ, నిర్మూలన చట్టం జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డిఇఒ వెంకటేశ్వరరావు, బాలిక అభివృద్ధి జిల్లా అధికారి ఎస్.నీరజ, బాలల రక్షణ జిల్లా అధికారి కె.వి.రమణ, ప్రిన్సిపాల్ ఆర్.రాంప్రసాద్ పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎస్‌పి కార్యాలయ ఎస్‌ఐ వెంకటరావు అన్నారు. మండలంలో కొండములగాం ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ అధ్యక్షతన బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట రమణ మాట్లాడుతూ నేడు సమాజంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీ పడుతున్నారని, అందుకు అనుగుణంగానే బాలికలు ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం మహిళలకు సంరక్షణగా ఎన్నో చట్టాలను అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ అజ్జాడ త్రినాథరావు, ఎఎస్ఐ రమణమూర్తి, జిల్లా బాలల రక్షణ విభాగం సోషల్ వర్కర్ గీత, ఎఎల్ఒ శ్రీనివాసరావు, చైల్డ్‌లైన్ సిబ్బంది రాజు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవ్‌గర్ల్స్ నినాదంతో విద్యార్థులు సేవ్‌గర్ల్స్ ఆకారంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కె.శ్రీరాములు మాట్లాడుతూ ఆడపిల్లలు చదువు ఇంటికే వెలుగని, ప్రతి ఒక్కరూ ఆడపిల్లలని చదివించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్‌వి చలం, సిహెచ్ యతిరాజారావు, అర్జున బాలరాజు, బుడ్డు సింహాచలం, ప్రసాదరావు, జగదీష్ పాల్గొన్నారు.

జి.సిగడాం: జాతీయ బాలికా దినోత్సవాన్ని కెజిబివి విద్యాలయంలో నిర్వహించారు. వేమన ఫౌండేషన్ నిర్వహించిన వేమన పద్యపోటీల్లో ప్రథమ స్థానం ఢిల్లేశ్వరి, ద్వితీయ స్థానం మాధవి, తృతీయ స్థానం వెన్నల ప్రియ కైవసం చేసుకున్నారు. విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. గెలుపొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఉషారత్నకుమారి, సిబ్బంది అభినందించారు.

ఇచ్ఛాపురం: శాంతినికేతన్ హైస్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. సమావేశానికి సభ్యులు కష్టమూర్తి రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఇంటరాక్ట్ క్లబ్ కో-ఆర్డినేటర్ కెసి పూరి, ప్రెసిడెంట్ డి.లక్ష్మీనరసింహారెడ్డి, సెక్రటరీ తేజస్, ఎస్ఎంసి చైర్మన్ మాధవి, ఉపాధ్యాయులు సురేఖ, శంకర్, పద్మజ, రాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: మండలం తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం హెచ్‌ఎం బల్ల కంఠయ్య, బెజ్జిపురం యూత్‌క్లబ్ సభ్యులు హేమసుందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు మానవహారం నిర్వహించారు. మండలం లోలుగు ఉపహార్‌స్వచ్ఛంద సంస్థలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థినిలకు ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నిర్మలారాణి, కో-ఆర్డినేటర్ ఏసుదాసు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ లోపింటి అప్పారావు, మహిళా పోలీస్ గీతా దుర్గాభవాణి, విఎఎ జ్యోత్స్న, బెజ్జిపురం యూత్‌క్లబ్ సభ్యులు శ్రావణి, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలో గూనానపేట ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం గురుగుబెల్లి మధుబాబు ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు చుక్కల తిరుపతిరావు పాల్గొన్నారు.

సోంపేట: జాతీయ స్థానిక దినోత్సవం పురస్కరించుకొని సోంపేటలో బాలిక సదన్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, తినుబండారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు ఎం.తిరుమలరావు, చలపతి, ఎం.ప్రవీణ్, బాలిక సదన్ సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న పీడీ శాంతిశ్రీ


మెళియాపుట్టి : సేవ్ గర్ల్స్ ఆకారంలో కూర్చొన్న విద్యార్థినులు


జి.సిగడాం : ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, ప్రిన్సిపాల్, సిబ్బంది


108 సిబ్బందికి శిక్షణ ఇస్తున్న కృష్ణ

'108' సిబ్బందికి శిక్షణ

పలాస: గర్భిణీలు పురిటినొప్పుల సమయంలో జాగ్రత్తలు పాటించి సాధారణ ప్రసవం అయ్యే విధంగా చూడాలని జిల్లా ఎఇఎంఎస్ మేనేజర్ హరిప్రసాద్, జగన్నాధరావు పర్యవేక్షణలో ఆన్‌జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ 108 సిబ్బందికి సూచించారు. సామాజిక ఆస్పత్రి ఆవరణలో 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో ఇఎంటిలకు యునైటెడ్ కింగ్‌డమ్ మాడ్యుల్ అనుగుణంగా శిక్షణ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర ప్రసూతి వైద్యసేవలు, శిశువు జన్మించిన తర్వాత శిశు పరిరక్షణపై వివరించారు. కార్యక్రమంలో టెక్కలి, పలాస, శ్రీకాకుళం డివిజన్‌లలో పనిచేస్తున్న ఇఎంటిలు పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్‌పై అవగాహన

ఆమదాలవలస: గ్రామ సచివాలయాల్లో త్వరలో చేపట్టనున్న పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని జిల్లా రిజిస్టర్ కిల్లి మన్మథరావు అన్నారు. బుధవారం పట్టణంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్‌పై సచివాలయ సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పేదలకు మంజూరు చేసిన ఇంటి స్థలాలను కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ వార్డు సచివాలయాలను జాయింట్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలుగా రూపొందించి రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 27 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలిపారు. స్థానిక సబ్ రిజిస్టర్ బి.అరుణ, సీనియర్ అసిస్టెంట్ కె.రాజేష్ బాబుతో పాటు ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, ఎల్‌ఎన్‌పేట కార్యదర్శులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

చెరువు స్థలం పరిశీలన


పలాస: మున్సిపాలిటీ పరిధిలో వైసిపి ప్రభుత్వంలో భూకబ్జాలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు విపరీతంగా పెరిగిపోయాయని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిపై దృష్టి పెట్టి తొలగించడం జరుగుతుందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస శివాజీ నగర్ శివాలయం ఎదురుగా ఉన్న పురుషోత్త సాగర్ చెరువు స్థలాన్ని బుధవారం ఆమె టిడిపి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివాలయం ఎదురుగా ఉన్న రెండు కోట్లు విలువ చేసే పురుషోత్త సాగర్ చెరువు స్థలాన్ని ఆక్రమించేందుకు వైసిపి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని, అదే జరిగితే రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కొంత మంది వ్యక్తుల నుంచి లక్షలాది రూపాయలు ఇచ్చిపుచ్చుకోవడాలు జరిగాయన్నారు. వైసిపి నాయకులే అధికారుల సంతకాలు చేస్తూ పట్టాలు చూపించి ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. చెరువు స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తుంటే రెవిన్యూ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బి.నాగరాజు, కొవ్వూరు సురేష్ కుమార్, అంబటి కృష్ణమూర్తి, వైకుంతరావు, పాండు రంగారావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి- కంచిలి

మండలంలో మకరంపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో బుధవారం 9వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంపిపి దేవదాస్ రెడ్డి చేతుల మీదుగా హెచ్‌ఎం బాబురావు, ఎంఇఒ చిట్టిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు ఆధునిక సాంకేతికత సైతం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో సిఎం ఈ టాబ్‌లు పంపిణీ చేపట్టారన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, లడ్డు కేశవ పాత్రో, ఎంపిటిసి అప్పారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దేందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకొస్తున్నారని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలో చిన్నబమ్మిడి జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఎంఇఒ ఎస్.అప్పలరాజు ఆధ్వర్యంలో 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి వాన లక్ష్మి, అసిరినాయుడు, రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు, వెంకటరమణమూర్తి, హెచ్‌ఎం భానుమూర్తి పాల్గొన్నారు.


కోటబొమ్మాళి : విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపిపితదితరులు

అక్కడ నిర్లక్ష్యం.... ఇక్కడ నిరీక్షణ


నారాయణ పురం కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నా చిన్నారులు

ప్రజాశక్తి- పలాస

అధికారుల నిర్లక్ష్యానికి అంగన్వాడీ కార్యకర్తలు అవస్థలు పడ్డారు. కేంద్రాలకు వచ్చిన పిల్లలు పౌష్టికాహారానికి దూరమయ్యారు. అంగన్వాడీ కేంద్రాలు సకాలంలో తెరవక పోవడంతో సమస్య తలెత్తింది. మరోవైపు సచివాలయ ఉద్యోగులు కేంద్రాల బాధ్యతలను అంగన్వాడీ కార్యకర్తలకు అప్పగించకపోవడం, తాళాలు తెరవక పోవడంతో మధ్యాహ్నం వరకు కొన్ని కేంద్రాలు తెరుచుకొని పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీతో పాటు మండలంలో నాలుగు సెక్టార్ల పరిధిలో 102 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. అంగన్వాడీ కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించాలని సుమారు 42 రోజులుగా సమ్మె బాట పట్టడంతో వాటి భాద్యతలను ప్రభుత్వం సచివాల ఉద్యోగులకు అప్పగించింది. అంగన్వాడీ సమస్యలను పరిష్కరించడంతో మరలా అంగన్వాడీ కార్యకర్తలు తమ విధుల్లో చేరారు. అయితే కేంద్రాల నిర్వహణ సచివాలయం ఉద్యోగులకు అప్పగించడంతో వారు అంగన్వాడీ కార్యకర్తలకు సకాలంలో కేంద్రాలను తెరచి కార్యకర్తలకు అప్పగించక పోవడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కేంద్రాల వద్ద అంగన్వాడీ కార్యకర్తలు పడిగాపులు కాశారు. మండలం నారాయణపురం, మున్సిపాలిటీ పరిధిలో నర్సిపురం, జయ రామచంద్ర పురం, మొగిలిపాడు, కోసంగిపురం, అంబుసోలి, సాయిబుల కాలనీ, కౌసల్య నగర్, పొందర వీధి, లేబర్ కాలనీ తదితర ప్రాంతాల్లో అదిగో తాళాలు ఇచ్చేస్తాను ఇదిగో వచ్చేస్తున్నాను అంటూ కాలయాపన చేయడంతో కేంద్రాలకు వచ్చిన చిన్నారులకు పౌష్టికాహారానికి దూరమయ్యారు. దీంతో కార్యకర్తలు ఇదే విషయాన్ని ఐసిడిఎస్ అధికారులు, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సచివాలయం ఉద్యోగులు అంగన్వాడీ కేంద్రాలను తెరచి కార్యకర్తలకు అప్పగించారు.

కొత్త దరఖాస్తులకు సప్లిమెంటరీ జాబితాలో చోటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు ఇతర సవరణల కోసం గడిచిన 41 రోజుల్లో 21,242 దరఖాస్తులు అందాయని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. తన కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో 30వ వారపు సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా (ఎస్ఎస్ఆర్ 2024)లో ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. తాజాగా వచ్చిన ఫారం 6, 7, 8లను పరిశీలించి సప్లిమెంటరీ ఓటరు జాబితాలో చేరుస్తామన్నారు. కొత్తగా ఓటు నమోదు కోసం 10,130 మంది గడిచిన 41 రోజుల్లో సంప్రదించారని, వారిలో 5519 మందిని చేర్చినట్లు, 3876 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచి మిగిలిన 735 తిరస్కరించినట్లు వివరించారు. కొత్తగా మృతుల ఓట్లను తొలగించాలని 774 దరఖాస్తులు రాగా, వాటిలో 113 పెండింగ్‌లో ఉంచి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాలో పేరు, చిరునామా తదితర తప్పులను సరిదిద్దాలని కోరుతూ 7490 దరఖాస్తులు రాగా, వాటిలో 4343 పరిష్కరించామని అన్నారు. ఈ నెల 25న జరిగే ఓటర్ల దినోత్సవంలో పాల్గొనాలని వారిని కోరారు. సమావేశంలో ఎస్.సత్యనారాయణ (వైసిపి), కె.వి.రామరాజు (టిడిపి), దేసెళ్ల మల్లిబాబు (కాంగ్రెస్), సోమేశ్వరరావు, ఎ.కృష్ణారావు (బిఎస్‌పి), సురేష్‌బాబు సింగ్ (బిజెపి), సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో విద్యార్థుల సత్తా


నౌపడ : విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్, తదితరులు

ప్రజాశక్తి- కవిటి

ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గస్థాయి క్రీడాపోటీల్లో మండలం ఆటగాళ్లు సత్తా చాటారు. నియోజకవర్గస్థాయి మెన్ బ్యాడ్మింటన్ పోటీలో కవిటి క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలవగా, వాలీబాల్ ఉమెన్ పోటీలో సహాలాలపుట్టుగ జట్టు మొదటి స్థానం, ఖోఖో తృతీయ స్థానం కైవసం చేసుకుంది. కపాసుకుద్ది గ్రామానికి చెందిన కబడ్డీ మహిళా జట్టు ప్రథమస్థానం సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైంది. విజేతలకు ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఎఒ శ్రీనివాస రెడ్డి, ఇఒ వీరభద్ర స్వామి, సర్పంచ్ కాయ దమయంతి, భీమసేన్ అభినందనలు తెలిపారు.

నౌపడ: ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీల్లో సంతబొమ్మాళి మండలం మర్రిపాడు బాలికల ఖోఖో జట్టు ప్రథమ స్థానం సాధించింది. బుధవారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన పోటీల్లో టెక్కలి ద్వితీయ స్థానం, నందిగాం తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా ప్రథమ స్థానంలో నిలిచిన మర్రిపాడు జట్టుకు సర్పంచ్ అట్టాడ కల్పన, కార్యదర్శి చింత శ్రీనివాసరావు, గ్రామస్తులు అభినందించారు.

ఇచ్ఛాపురం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక సురంగీ రాజా క్రీడామైదానం ఆవరణలో బుధవారం ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో నాలుగు మండలాల నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటెన్, క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు 322 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట, స్త్రీల విభాగంలో సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం, కబడ్డీ పురుషుల విభాగంలో సోంపేట, ఇచ్ఛాపురం, కంచిలి, స్త్రీల విభాగంలో కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట, ఖోఖో స్త్రీల విభాగంలో ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి, వాలీబాల్ స్త్రీల విభాగంలో కవిటి, కంచిలి మండలాలు వరుస మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ పోటీలను మండల తహశీల్దార్ గురుప్రసాద్ అధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఈశ్వరావు, మున్సిపల్ కమీషనర్ ఎన్. రమేష్, జోన్-1 వ్యాయామ ఉపాధ్యాయ అధ్యక్షులు పద్మనాభంరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కవిటి : మొదటి స్థానంలో నిలిచిన వాలీబాల్ జట్టు

లారీ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి- రణస్థలం

సికింద్రాబాద్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలో కొవ్వాడ గ్రామానికి చెందిన మైలపల్లి పోతురాజు (22) సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే పోతురాజు గత కొనేళ్లుగా సికింద్రాబాద్ సమీపంలో రోడ్డుపై హెల్మెట్‌లు, టోపీలు, కళ్లద్దాలు, తదితర వస్తువులు అమ్ముకుని కుటుంబతో సికింద్రాబాద్‌లోనే జీవనం సాగిస్తుస్తూ నివాసం ఉంటున్నారు. ఇటీవల సంక్రాంతి పండగకు స్వగ్రామం కొవ్వాడ వచ్చి కొద్ది రోజులు ఉండి ఇటీవల కుటుంబంతో కలసి సికింద్రాబాద్ వెళ్లిపోయారు. బుధవారం ఉదయం పాలు ప్యాకెట్లు కోసం ద్విచక్ర వాహనంతో వస్తుండగా క్వారీ లారీ వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


ప్రమాదంలో గాయపడిన మోహిని

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి- సోంపేట


మండలంలో పాలవలస గ్రామ జాతీయ రహదారి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన తొందర మోహిని అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామం నుంచి సమీపంలోని పొలాలకు వంట చెరుకు కోసం వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా కంచిలి నుంచి పలాస వైపు వెళ్లే కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళకు గాయాలు కావడంతో స్థానికులు గుర్తించి ఆమెను హరిపురం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోయిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మరల శంకరరావు, సంగారు లక్ష్మీనారాయణ, చెల్లూరు ధర్మారావు కోరారు.

నేడు పెన్షనర్ల ధర్నా

ఆమదాలవలస: ఈనెల 25న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సంఘ గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు, కోశాధికారి హెచ్‌వి సత్యనారాయణ తెలిపారు. బుధవారం పట్టణంలో అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద పెన్షనర్ల సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్లకు రావల్సిన డిఎ ఎరియర్లు, పిఆర్‌సి బకాయిల చెల్లింపులు, మెడికల్ బిల్ చెల్లింపుల్లో జాప్యం, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని తాలూకా కేంద్రాల్లో ఈ నెల 25న రాష్ట్ర విశ్రాంత ఉద్యోగులు తలపెడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా వారికి సంఘీభావంగా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సభ్యులంతా తహశీల్దార్ కార్యాలయం ఎదుట హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వ ఆదీనంలోఉన్న విశ్రాంత ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నామని జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదకొండవ పిఆర్‌సి ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, హెల్త్ కార్డుల ద్వారా అన్ని వ్యాధులకు గుర్తింపు పొందిన ఆస్పత్రిలో వైద్యం అందివ్వాలని, మెడికల్ రీయంబర్స్ మెంట్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలన్న డిమాండ్ల సాధన కోసం పోరాటం చేయనున్నామని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గం ఆదేశాల మేరకు 25న తాలూకా కేంద్రాల్లో ధర్నా నిర్వహించనున్నామని, 29న జిల్లా కేంద్రాల్లో ధర్నా నిర్వహించనున్నామని, ఫిబ్రవరి 5న రాష్ట్ర కేంద్రంలో ధర్నా కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల విశ్రాంత ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.


ఆమదాలవలస : సమావేశంలో మాట్లాడుతున్న జనార్ధనరావు


వాదులాడుకుంటున్న శంకర్, వెంకటేష్

టిడిపిలో కుమ్ములాట

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నియోజకవర్గంలో టిడిపిలో వర్గ విభేదాలు రచ్చకెక్కాయి. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వ్యతిరేక వర్గీయులుగా ఉన్న జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ తన వ్యక్తిగత ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు ముందుకెళ్తున్నారు. అందులో భాగంగా నగరంలోని రెల్లి వీధిలో బుధవారం ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన అనుచరులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని టిడిపి తరపున ప్రచారం చేస్తున్న సమయంలో లక్ష్మీదేవి వర్గీయులు నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్ ఆయన అనచరులతో వచ్చి అడ్డుకున్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిని కాదని ఇటువంటి కార్యక్రమాలు ఎలా చేపడతారని, పార్టీకి నష్ట దాయకంగా ఉన్న ఈ కార్యక్రమాన్ని నిలుపుదల చేయాలని కోరారు. దీంతో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పార్టీ ప్రయోజనం కోసమే తాను నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని, అడ్డుకునే ప్రయత్నం సరికాదని గొండు శంకర్ ప్రత్యర్థులకు వివరణ ఇచ్చారు. జిల్లా పార్టీ నేతల నుంచి ఒత్తిడి రావడంతో కొద్దిసేపటి తర్వాత ఇరు గ్రూపుల వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

శివాజీనగర్‌లో పర్యటించే అర్హత శిరీషకు లేదు

ప్రజాశక్తి- పలాస

మున్సిపాలిటీ నడిబొడ్డున 25 ఏళ్ల క్రితం శివాజీనగర్ ఏర్పడిందని, పదేపదే ఎమ్మెల్యేగా పదవి చేపట్టిన గౌతు శివాజీ అభివృద్ధి చేయలేదని, ఒక్క శంకుస్థాపన కూడా చేయనప్పుడు శివాజీ నగర్‌లో గౌతు శిరీష ఎలా పర్యటిస్తారని 20వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి అంబటి అనంద్, కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్, వైసిపి అధికార ప్రతినిధి బడగల బల్లయ్య, వైసిపి లీగల్‌సెల్ సభ్యుడు సాహుకారి నాగేశ్వరరావు ప్రశ్నించారు. శివాజీ నగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శివాజీ తన పేరు పెటుకున్నప్పటికీ ఏనాడు శివాజీనగర్ అభివృద్ధికి ఒక్క రోడ్డుకు శంకుస్థాపన కూడా చేయలేదని ఆరోపించారు. గతంలో శివాజీనగర్ రోడ్లు, కాలువలు, కనీసం వీధిలైట్లు లేక దుర్భరస్థితిలో ఉండేదని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఎన్నోసార్లు వినతిపత్రాలు అందించినా కనీసం స్పందించలేదన్నారు. మంత్రి అప్పలరాజు అధికారంలోనికి వచ్చాక మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్వర్యంలో శివాజీనగర్‌లో రూ.85 లక్షల వ్యయంతో రోడ్లు, కాలువలు, వీధిదీపాలు వంటి పలు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రానున్న రోజుల్లో కౌన్సిల్ సమావేశంలో శివాజీనగర్ పేరు తొలగించి ఛత్రపతి శివాజీనగర్ అని నామకరణం చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కింతలి బాబూరావు, బమ్మిడి సుధాకర్, దట్టి పార్వతి, అందవరపు సూర్యనారాయణ, నర్సింహులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పగడాలమ్మ

'పది' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- టెక్కలి

డివిజన్ పరిధిలో అన్ని ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల చదువులపై హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టి సారించాలని టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిణి గార పగడాలమ్మ సూచించారు. బుధవారం ఓక్లాండ్ పాఠశాల మైదానంలో డివిజన్ స్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే పదవతరగతి పబ్లిక్ పరీక్షల కాలనిర్ణయపట్టిక వెలువడిన నేపథ్యంలో ఫలితాలు మెరుగుకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఫలితాలు మెరుగుకు విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయాలన్నారు. సమావేశంలో భాగంగా ఇఎండిపి పుస్తకాన్ని పగడాలమ్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐటిసెల్ విభాగం ఇన్‌ఛార్జి తేజ, జిల్లా సైన్స్ అధికారి ఎన్. కుమారస్వామి, జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి జి.రాజేంద్ర ప్రసాద్, విద్యాశాక ప్రతినిది శరత్, డివిజన్ ప్రధానోపాధ్యాయుల సంఘ నాయకులు రామకృష్ణారావు, చిలుకు కృష్ణారావు, ఎస్.హరిబాబు పాల్గొన్నారు.

'ఆసరా'లో వైసిపి అబద్ధపు లెక్కలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో కోటి 14 లక్షల మంది డ్వాక్రా సభ్యులుంటే వారిలో 79 లక్షల మందికి ఆసరా నిధులిచ్చి మిగిలిన 35 లక్షల మందికి పథకాన్ని వర్తించకుండా చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి విమర్శించారు. అరసవల్లిలోని ఆమె స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తూ స్వయంశక్తి సంఘాలు తీసుకొచ్చింది తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనేనని గుర్తు చేశారు. వారికి పొదుపు సంఘాల ద్వారా మహిళా సాధికారిత అందిచామన్నారు. మహిళలకు పెద్దఎత్తున రుణాలు ఇచ్చి ఆర్థిక స్వావలంబన దిశగా నడిపించామన్నారు. టిడిపి పాలనలో సున్నా వడ్డీ రూ.5 లక్షలకు వర్తింపజేస్తే, దాన్ని జగన్మోహన్‌రెడ్డి రూ.3 లక్షలకు కోత వేసి మోసం చేశారని గుర్తుచేశారు. ఆ రూ.3 లక్షలకు కూడా సున్నా వడ్డీ కేంద్రమే భరిస్తోందని పేర్కొన్నారు. కానీ, వైసిపి తామే ఇస్తున్నట్టు నమ్మ బలుకుతూ మహిళలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

'తెప్పల'కు సత్కారం

ప్రజాశక్తి- పలాస

చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిలాయి నెహ్రూ సాంస్కృతిక భవనంలో ప్రవాసాంధ్ర ప్రజా నాట్యమండలి ఈనెల 21 నుంచి 23 వరకు మూడు రోజులు పాటు జరిగిన డి.వి సత్యనారాయణ స్మారక నాటిక ముగింపు సందర్భంగా కళాకారుడు, రచయిత, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కాశీబుగ్గకు చెందిన డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి నాట్యమండలి అధ్యక్షులు శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు లండ రుద్రమూర్తిలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తిని జనజాగృతి అధ్యక్షులు లఖినాన వెంకటాచలం, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు హేమాచలం, లలిత కళారంజని అధ్యక్షులు చిన్నా ఆచారి, శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షులు చిట్టి వెంకటరావు అభినందనలు తెలిపారు.



కృష్ణమూర్తిని సత్కరిస్తున్న నాట్యమండలి అధ్యక్ష, గౌరవాధ్యక్షులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


టెక్కలి రూరల్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఆర్‌టిసి డిపో గ్యారేజ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని ఎపి ఆర్‌టిసి కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షులు వి.తులసీరాం డిమాండ్ చేశారు. బుధవారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సూపరింటిండెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఇచ్చే సర్కులర్ ప్రకారం జీతం ప్రతినెల 10వ తేదీలోగా అకౌంట్లో జమ చేయాలని, ప్రతి ఆరు నెలలకు పెరిగే డిఎ బకాయిలను ఎరియర్స్ రూపంలో కార్మికులకు చెల్లించాలని, ఆరు నెలలకు విడుదలయ్యే నోటిఫికేషన్ నోటీసు బోర్డు ద్వారా కార్మికులకు తెలియజేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. థర్డ్ పార్టీ విధానాన్ని రద్దుచేసి ఆర్‌టిసి ద్వారానే నేరుగా కార్మికులకు జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యం.చిన్నప్పడు, వి.రాములు, సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు పాల్గొన్నారు.

పలాస: ఆర్‌టిసి సంస్థలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.26 వేలు వేతనం చెల్లించాలని ఎపి పిటిడి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి తులసిరాం డిమాండ్ చేశారు. ఆర్‌టిసి డిపోలో బుధవారం అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఆర్టీసీ డిపో మేనేజర్ రోణంకి సీతారాం నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్క్యులర్ ప్రకారం జీతం ప్రతినెలా 10వ తేదీలోపు కార్మికుల అకౌంటుకు జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు వి.రాములు, ఎం.చిన్నప్పడు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి తదితరులు పాల్గొన్నారు.


పలాస : డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

డోకులపాడు గ్రామానికి చెందిన ఉప్పాడ కామమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబం కావడంతో దయనీయ స్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న కృష్ణవేణి మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు స్పందించి బుధవారం ఆ కుటుంబానికి రూ.3 వేలను ట్రస్ట్ ఫౌండర్ సాన పాపారావు, మాజీ సర్పంచ్, ట్రస్ట్ చైర్మన్ అంబటి రామకృష్ణ చేతులు మీదుగా అందించి ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్‌సభ్యులు రెయ్యి గణపతి, సాన సంతోష్, క్రాంతి, బాలు, తులసీరావు, దేవానంద్ పాల్గొన్నారు.


కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో తిప్పణపుట్టుక గ్రామంలో కొత్తగా నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే బెందాలం అశోక్ ప్రారంభించారు. ఎంపీ రామ్మోహన్ నాయడు తన ఎంపీ గ్రాంట్ నుంచి రూ.10లక్షలు మంజూరు చేశారు. ఈ నిధుల్లో రూ.5 లక్షలతో సిసి రోడ్డు, రూ.5లక్షలతో కమ్యూనిటీ భవనం నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా బుధవారం ఎమ్మెల్యే అశోక్ కమ్యూనిటీ భవనం ప్రారంభం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు, సాడి సహదేవ్ రెడ్డి, బోర ప్రసాద్ రెడ్డి, కొండ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామస్థాయి కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక వెలుగు అసోసియేషన్ కార్యాలయంలో కమ్యూనిటీ ఆర్గనైజర్స్‌కు, గ్రామస్థాయి కార్యకర్తలకు నైపుణ్యం పెంపుదలపై శిక్షణ ఇచ్చారు. వెలుగు కార్యదర్శి బి.సంజీవరావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేయుచున్న పథకాలు అర్హులందరికి అందేలా, గ్రామాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. పథకాలపై వెలుగు అసోసియేషన్ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. వెలుగు అసోసియేషన్ పనిచేస్తున్న గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ఆదివాసులు అందరికీ తెలియజేసి అర్హులందరిని గుర్తించి పథకాలు పొందేటట్లు చేయడం, అభివృద్ధిపనులు గుర్తించి ప్రభుత్వానికి తెలియజేయనున్నారన్నారు. కార్యక్రమంలో నాగరాజు, చిరంజీవిరావు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి- పలాస

మండలం బ్రాహ్మంతర్ల హోమియో వైద్యశాలలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో యోగా శిక్షకులకై బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూకు ముగ్గురు హాజరైనట్లు వైద్యులు దుర్గాప్రసాద్ పట్నాయక్ తెలిపారు. పిజి డిగ్రీ సర్టిఫికెట్లతో పాటు ఎక్స్పీరియన్స్ సర్టిఫికెట్లను పరిశీలన చేయడం జరిగిందని, వాటి వివరాలను ఆయుష్ కమిషనర్ విజయవాడకు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటాపురం పిహెచ్ వైద్యురాలు అంజలి, ఫార్మసిస్ట్ జోసెఫ్, హెచ్‌ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

గౌతు శిరీష పరామర్శ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలో పలుగ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పరామర్శించారు. బుధవారం నగరంపల్లిలో కింతల గోపాలరావు, రెయ్యిపాడు జోగ తులసమ్మ, దేవునల్తాడలో తులే అప్పారావు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆమెతో పాటు మండల టిడిపి అధ్యక్షుడు సూరాడ మోహనరావు, అరసవల్లి ఉమామహేశ్వరరావు, దువ్వాడ జయరాం చౌదరి, చక్రవర్తి, దువ్వాడ అప్పారావు, సైన బాలాజీ, కొనారి మల్లేష్, గోవింద పాపారావు, అప్పాజీ, మెట్ట రమణ, నారాయణస్వామి వున్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

70 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో చీడివలస గ్రామ సచివాలయ పరిధిలో 70 మందికి 104 ద్వారా వైద్య పరీక్షలు గుత్తవిల్లి రమ్యశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా రక్త పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ప్రతిఒక్కరు వ్యాధుల పట్ల అపరిమితంగా ఉండాలని వారు తెలిపారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్ అప్పలనాయుడు, డిఇఒ వెంకటరమణ, పైలట్ అసిరినాయుడు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి- నందిగాం

మండలంలో హర్షబాడ గ్రామానికి చెందిన పలువురు టిడిపి కార్యకర్తలు శ్రీకాకుళం వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ సమక్షంలో వైసిపిలో చేరారు. టిడిపికి చెందిన బూరె భుగింగరావు, బూరె గోవిందరావు, జీవనరావు, నందిగాం గోవిందరావు, ధర్మారావు, జానం కేశవరావుతో పాటు పలువురు వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పలువురు వైసిపికి మద్దతు పలుకుతుంటే, టిడిపి నాయకులు తమ ఉనికి కోల్పోతామనే భయంతో వాళ్ళ పార్టీలోని వారికే మళ్లీ కండువాలు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు తమిరి ఫాల్గుణరావు, హరిదాసుపురం సర్పంచ్ కణితి నారాయణమూర్తి, నందిగాం మహేష్ పాల్గొన్నారు.

సోంపేట: మండలంలో కర్తలి పాలెం గ్రామానికి చెందిన సుమారు 20 కుటుంబాలు బుధవారం మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ పరిపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. అనంతరం సాయిరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి మరింత ఆదరణతో గెలుపొందుతారన్నారు. పార్టీలో చేరిన వారికి సాయిరాజ్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపిపి దాసు, నాయకులు ఎస్.భాస్కరరావు, బి.శ్రీకష్ణ, పి.గున్నయ్య, కె.శ్రీనివాస్, కామేష్, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు. అలాగే పాలవలస గ్రామంలో 10 కుటుంబాలు వైసిపిలో చేరాయి.


సోంపేట : పార్టీలోకి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న సాయిరాజ్

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా సోమసుందరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా కె.సోమసుందరరావు ఎన్నికయ్యారు. నగరంలోని నగరంలోని శాంతా కళ్యాణ్ అనురాగ నిలయంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఎస్.ఆర్.ఎస్.ప్రకాశరావు అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర సంఘం సహాధ్యక్షులు రౌతు రామమూర్తి, పరిశీలకులుగా ఆర్.కృష్ణమూర్తినాయుడు, ఎం.సుధాకరరావులు వ్యవహరించారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా పేడాడ సూర్యప్రసాదరావు, కోశాధికారిగా కె.వెంకటేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.నరసింహమూర్తి, ఉపాధ్యక్షులుగా ఎ.చంద్రశేఖరరావు, ఎస్.ఎస్.సత్యనారాయణ, ఆర్.ఆనందరావు, శశిభూషణ్ పాడి, డి.వి.రఘు, సంయుక్త కార్యదర్శి వి.కనకయ్య, జి.గణపతాచారి, ఎం.లక్ష్మణరావు, బి.జయలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బిచిన్మయరావు, వి.నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు వ్యవహరించారు.


ఎన్నికైన నూతన కార్యవర్గం

ఆరోగ్యవంత సమాజ నిర్మాణానికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి నడక సంఘాల ఇతోధికంగా కృషి చేస్తున్నాయని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 గవర్నర్ జామి నారాయణస్వామి అన్నారు. ఆదిత్య ఇన్‌లో బుధవారం నిర్వహించిన 2024 స్టార్ వాకర్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యం, ఆనందంతో పాటు నిరుపేదలకు చేయతనిచ్చే అనేక సామాజిక కార్యక్రమాలు చేయడంలో ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో అగ్రస్థానంలో నిలిచిన స్టార్ వాకర్స్ క్లబ్ అన్ని క్లబ్‌లకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. సభ్యులు భవిష్యత్‌లో ఇదే ఉత్సహంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత అధ్యక్షుడు ఎస్.జోగినాయుడు సమక్షంలో చేపట్టిన కార్యక్రమాలను కార్యదర్శి గోలీ సంతోష్, కోశాధికారి బి.దేవీప్రసాద్‌లు నివేదించారు. అనంతరం సభ్యులందరితో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షునిగా బి వి. రవిశంకర్, ప్రధాన కార్యదర్శిగా బి.దేవీప్రసాద్, కోశాధికారిగా గోలీ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా బొడ్డేపల్లి ప్రసాదరావు, జాయింట్ సెక్రటరీగా బి.వెంకట సత్యనారాయణ, జోలి వాకర్‌గా మలిపెద్ది మల్లిబాబు, గౌరవ అధ్యక్షులుగా జి.ఇందిరాప్రసాద్, మరో ఆరుగురు బోర్డు డైరెక్టర్లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పి.జి.గుప్తా, గుడ్ల సత్యనారాయణ, ఎలక్ట్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణుగోపాలరావు పాల్గొన్నారు.

భూములకు సాగు హక్కు కల్పించాలి


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెంకటరమణ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

గిరిజనులు సాగు చేస్తున్న భూములకు హక్కులు కల్పించాలని తహశీల్దార్ వి.లక్ష్మీనారాయణకు సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చిగురువలస పంచాయతీ పరిధిలో బసవ మామిడి వలసలో ఎనిమిది కుటుంబాలు 20 సంవత్సరాలుగా సర్వే నెంబరు 50లో 35 ఎకరాలను సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. వారు సాగు చేసుకుంటున్న భూములకు సాగుహక్కులు కల్పించాలని పలుమార్లు ప్రభుత్వానికి తెలియజేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న భూహక్కుల సర్వేలో గ్రామ గిరిజనులకు సాగు హక్కులు కల్పించాలని తహశీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, గిరిజనులు సవర సింహాచలం, ధర్మారావు, అప్పలమ్మ పాల్గొన్నారు.

సమైక్యంగా ముందుకు సాగాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన సమైక్యంగా ముందుకు సాగి గెలుపునకు కలిసికట్టుగా కృషి చేయాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి పిలుపునిచ్చారు. సంతలక్ష్మీపురం సర్పంచ్ బమ్మిడి భాస్కరరావు స్వగృహంలో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండలంలోని గొప్పిలి, గోకర్ణ పురం, సంతలక్ష్మీ పురం, కరజాడ, మర్రిపాడు కె,భరణి కోట తదితర పంచాయతీ నాయకులతో మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రానున్నది టిడిపి ప్రభుత్వమేనని, టిడిపి, జనసేన నాయకులు గ్రామాల్లో కలిసికట్టుగా పనిచేసి టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి మహిళా ఉపాధ్యక్షురాలు బూర్ల లలిత కుమారి, మాలతి శ్రీధర్, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్ రెడ్డి, చాపర మాధవరావు, ఒరిసి ఢిల్లీరావు, శేఖర్, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కార్యకర్తలతో మాట్లాడుతున్న కలమట వెంకటరమణ

విధ్వంసం తప్ప అభివృద్ధి ఎక్కడ?

ప్రజాశక్తి- పలాస

నియోజకవర్గంలో రాష్ట్రమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విధ్వంసం చేసేరే తప్పా అభివృద్ధి ఎక్కడ చేశారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషా ఆరోపించారు. లేబరు కాలనీలో బుధవారం పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస కాశీబుగ్గ కె.టి రోడ్డు నేటికి మూడేళ్ల పైబడి కావస్తున్నా పూర్తి చేయకలేకపోయారన్నారు. సూదికొండ, నెమలికొండ, వజ్రపుకొత్తూరులో అనంతగిరికొండ, మందసలో నల్లబొడ్లూరుకొండలను అమ్ముకున్నారే తప్పా అభివృద్ధి ఏమీ చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారం చేపట్టనుందని, అందుకు నాయకులు, కార్యకర్తలు శ్రమించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్ గుప్తా పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న సర్పంచ్, ఎంపిటిసి తదితరులు

క్రికెట్ విజేత ఆర్.బెలగాం

ప్రజాశక్తి- కవిటి

మండలం డి.గొనపపుట్టుగలో శ్రీ ప్రతిభ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ఆర్.బెలగాం జట్టు విజేతగా నిలిచింది. బుధవారం జరిగిన తుదిపోరులో డిజి పుట్టుగ జట్టుపై విజయం సాధించిన ఆర్.బెలగాం ట్రోఫీతో పాటు రూ.20వేలు నగదు బహుమతి గెలుచుకుంది. ద్వితీయ స్థానంలో డిజి పుట్టుగ ట్రోఫీతో పాటు రూ.12వేలు నగదు బహుమతి గెలుచుకుంది. విజేతలకు సర్పంచ్ బెందాలం కిరణ కుమారి, జయప్రకాష్, ఎంపిటిసి చందాన పూర్ణచంద్రరావు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో బెస్ట్ బ్యాట్స్ మ్యాన్‌గా కరగాన సూర్యప్రకాష్, బెస్ట్ బౌలర్‌గా కరగాన చంద్రయ్య, మేన్ ఆఫ్ ది మ్యాచ్ ఆది, బెస్ట్ బౌలర్‌గా అన్వేష్, బెస్ట్ కీపర్‌గా అవినాష్, బెస్ట్ ఫీల్డర్‌గా ఢిల్లీరావు, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా కరగాన దిలీప్ బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రతిభ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.


చిత్రపటాన్ని అందజేస్తున్న ఇఒ హరిసూర్యప్రకాష్

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని అగ్నిమాపకశాఖ విజయవాడ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీస్ జ్ఞాన సుందరం బుధవారం సందర్శించారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి చిత్రపటాన్ని ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు. ఆయనతో పాటు జిల్లా అగ్నిమాపక శాఖాధికారి జె.మోహనరావు, ఎడిఎఫ్ఒ ఎం.వరప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ

ప్రజాశక్తి- కవిటి

తమజాతి గుర్తింపు కోసం ఇంకా ఎన్నేళ్లు నిరీక్షించాలని బెంతు ఒరియాలు ప్రశ్నించారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడంతో తమ బిడ్డలు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారని, నిరుద్యోగులు ఉద్యోగ అర్హత కోల్పోతున్నారని, కూలి పనులు చేసి బతుకుతున్న తమకు ప్రభుత్వ పథకాలు అందకుండాపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి పరిష్కారం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అందులో భాగంగా 28వ రోజు జరుగుతున్న దీక్షల్లో సూదిపుట్టుగ గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో దొండ మోహన్, దాల్, మహిమ దల్లై, బెంతు ఒరియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉషు విజేత శిరీషకు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తమిళనాడులో జరిగిన ఉషు ఖేలో ఇండియా సౌత్ జోన్ నేషనల్స్‌లో విద్యాధరి డిగ్రీ కళాశాల విద్యార్థిని ముద్దాడ శిరీష గోల్డ్ మెడల్ సాధించడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ డాక్టర్ జామి భీమశంకరరావు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో బుధవారం ఆమెను అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు వి.టి.నాయుడు, సంపత్, కిరణ్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.


ఇండస్ట్రియల్ విలేజ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

వృత్తి విద్యాకోర్సులతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి- పొందూరు

వృత్తి విద్యాకోర్సులతో విద్యార్థులు ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవచ్చునని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ అన్నారు. బుధవారం మోడల్‌స్కూల్ ఒకేషనల్ విద్యార్థులకు ఇండస్ట్రియల్ విలేజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎచ్చెర్లలోని మహిళలు చేపడుతున్న కుట్టుమిషన్లు, అల్లికలను విద్యార్థులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వృత్తివిద్యా ఉపాధ్యాయిని సీపాన మాలతి, మంగమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలో పాతనౌపడా ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కె.కొత్తూరు పిహెచ్‌సి వైద్యాధికారి ఇంద్రజ, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, నేపాలం కృష్ణ, బోడ్డేపల్లి విద్యావతి, ఆర్. రమేష్‌కుమార్, వైద్య సిబ్బంది కర్రి వెంకటరావు, ఆశావర్కర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మహాత్మాజ్యోతీభాపూలే బాలికల గురుకుల పాఠశాల్లో నిర్వహించిన కార్యక్రమంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైతే దేశానికి వెన్నెముక

ప్రజాశక్తి- పలాస

శ్రీ చైతన్య సంస్థ ప్రతినెల నిర్వహించే స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా జరిగిన జై కిసాన్ జై భారత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దేశానికి వెన్నెముక రైతని, రైతు ప్రతి గింజా ఏ విధంగా పండిస్తున్నారు, వాటి యొక్క విశేషాలను పిల్లలకు తెలియజేశారు. విద్యార్థులకు అవగాహన కల్పించడానికి స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపల్ వై.రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎజిఎం సురేష్, ప్రాంతీయ పరిరక్షణ అధికారి రామినాయుడు, కో-ఆర్డినేటర్ బాలరాజు, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ రాము, డీన్ కోటేశ్వరరావు, జోగారావు, జయబాబు పాల్గొన్నారు.